
ప్రజాశక్తి
గురువారం 11 జులై 2024 5 విజయనగరం



పాఠశాలలను సందర్శించిన యుటిఎఫ్ బృందం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యారంగ సమస్యలను తెలుసుకునేందుకు పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలను బుధవారం యుటిఎఫ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు అమలుచేసి, సబ్జెక్టు టీచర్ల కొరత అధిగమించాలని ప్రభుత్వాన్ని కోరారు. బదిలీలు కూడా చాలా కాలంగా నిలిచిపోయాయని చెప్పారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ ఫైల్సు వేగవంతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా, పట్టణ నాయకులు ఆనెం శ్రీనివాస్, స్వామి నాయుడు, రాధాకృష్ణ, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలు రద్దుచేయాలి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి ● సిఐటియు ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా నిరసనలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులకు సంకెళ్లు వేసే లేబర్ కోడ్‌లను, కేంద్రప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిమాండ్స్‌డే సందర్భంగా బుధవారం అఖిల భారత రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఒ అనితకు అందజేసారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు ఎ. జగన్మోహన్‌రావు, యుఎస్ రవికుమార్, బి.రమణ, వి.రాములు, బి .సుధారాణి మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 3 వ సారి అధికారంలోకి రాగానే జులై 1 నుంచి నూతన చట్టాలు ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిందని, ప్రశ్నించే వారిపై దేశద్రోహం కేసులు నమోదు పెడుతోందని అన్నారు. న్యాయవాదులు, పౌర సమాజం వీటిని వ్యతిరేకిస్తున్నప్పటికీ మోడీ మొండిగా అమలుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. రవాణా రంగ కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం చేయాలని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జెఎస్ఎన్ రాజు, రాఘవ, ఎస్ రాజు, కుమార్, మధు, వై రామారావు, ప్రసన్న, ఆనంద్, సత్యనారాయణ, సాగర్ పాల్గొన్నారు.

కొత్తవలస : డ్రైవర్లకు ప్రమాదకరమైన బిఎన్ఎస్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఆటో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ ప్రమాదకరమైన క్రిమినల్ చట్టాలు అమలు చేయడం దారుణమన్నారు. పది కోట్ల మందికి పైగా ఉన్న రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్సు ఉన్న అర్హులైన డ్రైవర్లందరికీ వాహన మిత్ర అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం డిటి సత్యనారాయణకు వినతి అందించారు.

భోగాపురం : డ్రైవర్లను నష్టం చేసే చట్టాలను రద్దు చేయాలని సిఐటియు నాయకులు బి సూర్య నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తాహశీల్దార్ కు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఓనం రమణ, బమ్మిడి సంజీవ్,నక్క శ్రీను కార్మికులు పాల్గొన్నారు.

రామభద్రపురం : సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా,అంగన్వాడీ,మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : బిఎన్ఎస్ రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మానాపురంలో జాతీయ రహదారిపై ఆటో కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ మోడీ నిరంకుశ పాలనకు కార్మిక, కర్షక ఐక్యతతో పోరాటం చేసి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు అప్పలనాయుడు, ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, ఈశ్వరరావు, శంకర్, గౌరి నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాలు మానుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద హమాలీలతో సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో విద్యుత్ హమాలీ సంఘం నాయకులు కెల్ల గోవిందరావు, పతివాడ లక్ష్మణరావు, మీసాల లెనిన్, పతివాడ పెద రాంబాబు, చిన రాంబాబు, కలిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పెన్షనర్ల నిరసన

గరివిడి : తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆల్ పెన్షనర్స్ యూనియన్ల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఇపిఎఫ్ పెన్షన్ 9 వేలు ఇవ్వాలని, డిఎ చెల్లించాలని, ఉచిత వైద్యం అందించాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గౌరినాయుడు, పిఎఫ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఒఎస్ఎన్ మూర్తి, సలీం, మైన్స్ యూనియన్ నాయకులు కరణం సన్యాసినాయుడు, పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరంలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు



కొత్తవలసలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ఎమ్మెల్యేతో అడుగడుగునా అవమానం

ఎంపి కలిశెట్టి ముందు వాపోయిన టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

'నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం మాధవితో మాకు అడుగడుగునా అవమానం జరుగుతోంది. మా పరిస్థితి పెనం మీదనుండి పొయ్యిలో పడినట్లుంది..అధికారికంగా మాధవి ఎమ్మెల్యేగా ఎన్నికైనా..బంగార్రాజే మాకు ఎమ్మెల్యే. మా బాధలను పట్టించుకోండి' అని విజయ నగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు ఇన్‌ఛార్జి కర్రోతు బంగ్రారాజు ముందు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏకరువు పెట్టారు. బుధవారం మండలంలోని చల్లవానితోటలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు గృహంలో మండల అధ్యక్షులు మహంతి శంకరావు అధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ 90 శాతం ఉన్న మనం ఓట్లు వేస్తే గెలిచిన ఎమ్మెల్యే లోకం మాధవి తమను చిన్నచూపు చూస్తోందని వాపోయారు. ఇటీవల పాఠశాలల్లో బ్యాగులు, పుస్తకాలు పంపిణీలో ఆమె వివక్ష చూపించారన్నారు. అధికారులకు జనసేన కార్యకర్తల పేర్లు ఇచ్చి వారికే ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పడం బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ముక్తకంఠంతో తెలిపారు. స్పందించిన బంగార్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మన అధినేత సిఎంగా ఉంటే ఈ నియోజకవర్గంలో మాత్రం ప్రతి కార్యకర్త భయంతో బతికే గడ్డు పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యలన్నీ తనకు తెలుసన్నారు. మీరంతా ధైర్యంగా ఉండాలని, మీ మాట వినని ప్రతి అధికారిని మారుస్తామని ధైర్యం చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు మాట్లాడుతూ కార్యకర్తలకు జరిగే అన్యాయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సమస్యను లోకేష్, చంద్రబాబుకు వివరించామన్నారు. అయితే కూటమిలో ఉన్నాం గనుక సంయమనం పాటిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఎంపి అయినా ఎమ్మెల్యే అయినా కార్యకర్తకు గౌరవం ఇవ్వాల్సిందే అన్నారు. మీరంతా కష్టపడితేనే తాము చట్ట సభలకు వెళ్లామన్న సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. అయితే చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని తెలిసిందన్నారు. త్వరలోనే పరిష్కారమవుతాయని తెలిపారు. అందరికీ 24 గంటలూ అందుబాటులో ఉండేలా కార్యాలయాలు ప్రారంబిస్తున్నానన్నారు. మీ సమస్య ఏదైనా ఉంటే నాకు నేరుగా చెప్పుకోవచ్చన్నారు. నెల రోజుల్లో మీ నియోజక వర్గంలో నా కార్యాలయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పతివాడ తమ్మునాయుడు, ఆకిరి ప్రసాదరావు, విక్రం జగన్నాధం, పిన్నింటి సన్యాసినాయుడు, పసుపులేటి గోపి, పిన్నింటి శ్రీనువాసరావుతో పాటు మండలంలోని నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, ఉన్నతాధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాభీష్టం మేరకే టోల్ గేట్

మరోసారి చర్చించి నిర్ణయం ● కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్‌హెచ్ 26 జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద నిర్మాణంలో నున్న టోల్ గేట్‌పై ప్రజల నుండి అసంతృప్తి వ్యక్తం అవుతున్న దృష్ట్యా ప్రజాభీష్టం మేరకే టోల్ గేట్‌ను ఉంచుతామని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. బుధవారం ఆయన ఛాంబర్ లో పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు తో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జొన్నాడ వద్ద టోల్ గేట్ ఏర్పాటు చేయడం లో జరిగిన అగ్రిమెంట్ కాపీలను, గజెట్ కాపీలను కలెక్టర్ పరిశీలించారు. నిబంధనలను అనుసరించి చేసారా లేదా జొన్నాడ వద్ద ఎందుకు టోల్ గేట్ ఏర్పాటు చేయవలసి వచ్చిందని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారుల పి.డి ప్రభాత్ రంజన్ మాట్లాడుతూ వివరాలన్నింటినీ సమర్పించడానికి రెండు రోజులు గడువు కోరారు. వివరాలను సమర్పించిన తర్వాత మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జె.సి కార్తీక్, ఆర్‌డిఒ సూర్యకళ, జాతీయ రహదారుల ఇఇ శ్రీనివాసులు, తహశీల్దార్ రత్నం తదితరులు పాల్గొన్నారు.



గరివిడిలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

● సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

● సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ కాంతారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, నెల్లిమర్ల, డెంకాడ

జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పని చేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులకు తక్షణమే మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి ఛైర్మన్ కాంతారావు డిమాండ్ చేవారు. ఈ మేరకు బుధవారం జిల్లాలోని అన్ని ఎంఇఒ కార్యాలయాలు, కెజిబివి పాఠశాలల వద్ద ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. 22వ రోజు సమ్మె కాలం జీతం, సమ్మె కాలపు ఒప్పందాలు, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని, అన్నీ విభాగాలకు మినిమం టైమ్ స్కేలు వర్తింపు చేయాలని, నూతన డిఎస్‌సిలో వెయిటేజీ ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చాలని, గెస్ట్, డైలీ వైజ్ సిబ్బందిని వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. మెంటాడ మండలంలో జరిగిన నిరసనలో కాంతారావు మాట్లాడారు. సకాలంలో వేతనాలు విడుదల కాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నెల్లిమర్ల మండలం ఎ. రామకృష్ణ, గరివిడిలో జిల్లా నాయకులు రామారావు, డెంకాడ మండలంలో రామకృష్ణ, జామిలో మెసెంజర్ యూనియన్ నాయకులు జయ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి ఛైర్మన్ ఉదారత

విజయనగరం టౌన్ : నగరంలోని లంకాపట్నం వీధిలో గల కారింగుల మనోరమ (27) పుట్టుకతో వినికిడి లోపంతో బాధపడుతుంది. తనకు ఏదో ఒక విధం వైద్యం అందించాలని ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఆమె వైద్యానికి నోచుకోలేదు. చెవిటి మిషన్ కూడా కొనుక్కోలేని పరిస్థితి ఉండడంతో విషయం తెలుసుకున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం తన ఛాంబర్‌లో ఆమెకు చెవిటి మిషన్ అందజేసి ఉదారత చాటుకున్నారు. ఇంకా ఇటువంటి అవసరం ఎవరికి ఉన్నా తనను కలవాలని కోరారు. జిల్లా ప్రజల క్షేమం కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు న్యాయం చేసేనా?

● పునరుద్ధరణకు నోచని పలు గ్రామాల రహదారులు

● నేడు పనులు పరిశీలించనున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశగా ఎదురు చూసిన భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్వాసితులకు ఆదిలోనే నిరాశ ఎదురైంది. ఇంకొందరైతే ఏకంగా నష్టపరిహారానికి కూడా నోచుకోలేదు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు కారణంగా కోల్పోయిన గ్రామాల లింకురోడ్లు, స్మశానాలు పున:నిర్మాణానికి కూడా నోచుకోలేదు. దీంతో, నిర్వాసితులు ఒకింత అసహనంతో ఉన్నారు. తాజాగా ఈనెల 11న ఎయిర్‌పోర్టు పనుల పరిశీలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు.

అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం కోసం భోగాపురం మండలంలో 2,700 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ నేపథ్యంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాల వారు ని రా శ్ర య ు ల య్యా ర ు. బొల్లెంకులపాలెం, ముడసర్ల పేట, మరడపాలెం, రెల్లిపేట గ్రామాలు పూర్తిగా కనుమరు గయ్యాయి. వారికి పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించకుండానే ఏడాది క్రితం బలవంతంగా వారిని ఖాళీ చేయించారు. టిడిపి ప్రభుత్వంలోనే వివిధ గ్రామాల్లో రూ. 24 లక్షల నుంచి రూ.34 లక్షల వరకు పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. అది సరిపోదంటూ సుమారు 30 మంది నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. గతేడాది మే 3న అప్పటి సిఎం వైఎస్ జగన్మోహరెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇందుకోసం ఉన్న కోర్టు కేసులను తొలగించేందుకు విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్ ద్వారా అదనపు పరిహారం ఇస్తామంటూ నమ్మబలికారు. ఆ పెద్దలే ఆ తరువాత చేతులేత్తేశారు. అంతా నోటి మాటల ద్వారా జరిగిపోవడంతో నిర్వాసితులు గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. సర్వే చేసే సమయానికి చాలా కుటుంబాలవారు బతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస పోయారు. వీరిని గుర్తించకపోవడంతో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి నోచుకోలేదు. విమానాశ్రయం నిర్మాణంలో గ్రామాల్లోని నిర్వాసితులను తరలించే సమయానికి 18 సంవత్సరాలు దాటిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇస్తామని గతంలో టిడిపి ప్రభుత్వమే హామీ ఇచ్చింది. వైసిపి ప్రభుత్వం కూడా దాన్ని అమలు చేయలేదు. ప్రభుత్వ బంజరు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పటికీ వారికి పరిహారం చెల్లించలేదు.

అదనపు భూములకు పరిహారమేదీ

జాతీయ రహదారి నుంచి విమానా శ్రయానికి వెళ్లేందుకు వేసే అప్రోచ్ రోడ్డు కోసం అదనంగా 110 ఎకరాల భూమిని నాటి ఆర్‌డిఒ భవానీ శంకర్ హయాంలో సేకరించారు. అప్పట్లో ఆ భూములపై ఉన్న రైతుల వివరాలు సేకరించి, పరిహారం వేసేందుకు అవార్డు పాస్ చెయ్యాలి. కానీ, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా ఎఫ్‌సిఒ రికార్డులో సంబంధిత సర్వే నెంబర్లలో ఉన్న రైతుల పేరుతో పరిహారం కోసం గతంలో అవార్డు పాస్ చేశారు. తీరా పరిహారం విడుదలయ్యే సమయానికి ఎఫ్‌సిఒ రికార్డులో ఎప్పుడో భూములు అమ్మేసిన వారు, చనిపోయిన వారు ఉన్నట్టు లేలింది. దీంతో, చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి విశాఖలోని భూసేకరణ ట్రిబ్యునల్ కోర్టులో ఆర్‌డిఒ ఆ సొమ్మును వేసేశారు. దీంతో, భూమిపై ఉన్న ప్రస్తుత రైతులంతా ఏడాది నుంచి ఆ పరిహారం కోసం ఆ కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. ఈ సమస్యలన్నింటిపైనా నిర్వాసితులు గతంలో కలెక్టర్ నాగలక్ష్మికి పలుమార్లు వినతులు అందజేశారు.

ఇదేనా ఉద్యోగ, ఉపాధి కల్పన తీరు?

విమానాశ్రయం వస్తే ఈ ప్రాంతంలో ఆందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకుతాయంటూ నాటి టిడిపి, వైసిపి ప్రభుత్వాలు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు ఆశ చూపారు. ఉద్యోగాల మాట అటుంచితే కనీసం నిర్మాణాల్లో కూలి పనులు కూడా కల్పించడం లేదు. జిఎంఆర్ నిర్మాణ సంస్థ చాలా పనులను ఎల్ అండ్‌టికి సబ్ కాంట్రాక్టుకు ఇచ్చింది. ఆ సంస్థ బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిశాకు చెందిన కూలీలతో పనులు చేయిస్తోంది. కనీసం ఐటిఐ, డిప్లమా, బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ చదువుకున్నవారిని కూడా పనుల్లోకి తీసుకోవడం లేదని నిర్వాసితులు చెబుతున్నారు. నిర్మాణ పనుల్లోనే ఉపాధి అవకాశాలు కల్పించకపోతే ఎయిర్‌పోర్టు ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు, ఉపాధి చూపుతామంటే ఎలా నమ్మాలి అంటూ నిర్వాసిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎయిర్‌పోర్టును 2026నాటికి అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుతాయని చెప్తున్న ప్రభుత్వం అందుకనుగుణంగా ఈ ప్రాంత యువతీ, యువకుకుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు చేపట్టలేదు. సిఎం చంద్రబాబు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల పరిశీలనతోపాటు నిర్వాసితుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై స్పందిస్తారా? లేదా వేచి చూడాల్సిందే.



స్పందనలో కలెక్టర్‌కు వినతి అందిస్తున్న నిర్వాసితులు (ఫైల్)

ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

పరిశీలించిన కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-భోగాపురం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి జిల్లా పర్యటనా ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు ప్రాంతంలో కలెక్టర్ పర్యటించి, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. భద్రతా ఏర్పాట్లపై ఎస్‌పి దీపికా పాటిల్‌తో చర్చించారు. ఇప్పటికే నిర్మితమైన రన్‌వేపై ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ స్థలాన్ని ముందుగా కలెక్టర్ పరిశీలించారు. అక్కడినుంచి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వద్దకు చేరుకొని వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఇక్కడ ఫొటో ఎగ్జిబిషన్, విఐపి లాంజ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. వర్షాకాలం కావడంతో, జెర్మన్ హేంగర్లతో పటిష్టమైన షెడ్లను నిర్మించాలని సూచించారు. అనంతరం టెర్మినల్ భవనం వద్దకు చేరుకొని ఏర్పాట్లపై సమీక్షించారు. టెర్మినల్ భవన నిర్మాణ పనుల పరిశీలన అనంతరం, అక్కడే ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడతారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తొలిసారిగా ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఎస్‌పి దీపికా పాటిల్‌తోపాటు, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, పోలీసు, ఆర్ అండ్‌బి అధికారులు, జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు హెడ్ రామరాజు, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి దీపిక, జెసి కార్తీక్

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. సిఎం పర్యటన ఏర్పాట్లు పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు చేయాల్సిన పనులపై సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి. అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నుంచే అభివృద్ధి ప్రారంభం

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర నుంచే రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఈరోజు ఉదయం స్థానిక అశోక్ బంగారు టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. అభివృద్ధి చేసినట్లు వైసిపి ప్రభుత్వం చెప్పుకుందే తప్ప చేసిందేమీ లేదన్నారు. గురువారం ఉదయం పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం భోగాపురంలో 12.35 గంటలకు అంతర్జాతీయ విమానాశ్రయం పనులను పరిశీలించడానికి రానున్నారని తెలిపారు. లివర్ లింకింగ్ ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తారని, మెట్ ఎక్స్‌జోన్ అభివృద్ధి పనులు పరిశీలించి దానిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ టిడిపి హయాంలోనే విమాన శ్రయ పనులు ఊపందుకుంటున్నాయని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ బొద్దల నర్సింగరావు, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, కంది మురళి నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు వందశాతం వసూలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ట్రేడ్ లైసెన్స్ విధింపు ప్రక్రియ శతశాతం జరిగేలా కృషి చేయాలని పారిశధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా చెత్త వర్గీకరణ ప్రక్రియ ఏ మేరకు నిర్వహించారూ, వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతివారం చెత్త వర్గీకరణ, అంటువ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విధానం పకడ్బందీగా అమలు జరగాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి- మెంటాడ

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని బుధవారం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసి రెండు నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి వేతనదారులు పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే బిల్లులు మంజూరు చేసి ఉపాధి కూలీలను ఆదుకోవాలనిడిమాండ్ చేశారు. డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృపారావు, చాకలి లక్ష్మి, వడ్డి సూరీదేవుడు, బాలయ్య పాల్గొన్నారు.

20వ రోజుకు జిందాల్ దీక్షలు

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌ను ఎత్తేయాలని కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 20వ రోజుకు చేరాయి. జిందాల్ యాజమాన్యం లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టి 55 రోజులు గడిచిపోయాయి. జిందాల్ యాజమాన్యం కనీసం స్పందించక పోవడంపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జెఎసి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిందాల్ జెఎసి నాయకులు గాడి అప్పారావు (సిఐటియు), పిల్లా అప్పలరాజు (టిఎన్‌టియుసి), నమ్మి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్త శుద్ధితో విద్యా బోధన చేయాలి

ప్రజాశక్తి - జామి

విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో బోధన కొనసాగించాలని ఎంఇఒ గంగరాజు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని విజినిగిరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఎంపిపి పాఠశాలను ఎంఇఒ సందర్శించారు. ఈ సందర్భంగా అకడమిక్ కేలండరు ప్రకారం సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. వర్క్ బుక్స్, నోట్ బుక్స్ కరెక్షన్ ఎప్పటికప్పుడు అందజేయాలని చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సంతృప్తి వ్యక్తం చేసి మధ్యాహ్న భోజన కార్మికులను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి-తెర్లాం

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, తదితర గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ నర్సు నాయుడు, గ్రామ సర్పంచి ప్రతినిధి వెంకట్రావు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

ప్రజాశక్తి-బాడంగి

ప్రభుత్వ పాఠశాలల్లో వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు బాడంగి హైస్కూల్ హెచ్ఎం దత్తి సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక హైస్కూల్లో కొత్తగా వికలాంగ విద్యార్థికి అడ్మిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగ విద్యార్థుల బోధనకు ప్రత్యేక ఉపాధ్యాయుడు ఉన్నారని తెలిపారు. వికలాంగులకు విద్యతో పాటు ప్రభుత్వం అనేక రకాల రాయితీలు, అలవెన్సులు ఇస్తోందన్నారు. పదోతరగతిలో 10 మార్కులకే ఉత్తీర్ణత అవకాశం ఉందన్నారు. హైస్కూల్లో విద్యార్థులకు నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని చెప్పారు. గతేడాది నలుగురు ట్రిపుల్ ఐటికి, నలుగురు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కి, ఆరుగురు వికలాంగ విద్యార్థులు జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌కి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి దేవరాపల్లి శ్రీను, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో గ్రామసభ

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ పాలవలస పార్వతి ఆధ్వర్యాన గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి పాలవలస గౌరు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు గ్రామాల్లో ప్రబలకుండా చూడాలని అన్నారు. ప్రజలంతా పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం తాగునీటి ట్యాంకును పరిశీలించి, క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు.



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపిటిసి

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-వేపాడ

ప్రకృతి సాగు విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చని డిఎల్ఎంపి నాయుడు తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా కృషి సఖి టీం సభ్యులు ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో వివరించారు. కార్యక్రమంలో ఆర్‌టిఎల్ ప్రకాశ్, ఆర్‌టిఒ హేమ సుందర్, ఆర్‌వైఎస్ఎస్ రమాప్రభ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎం.ఆదియ్య, ఎపిఎం వెంకటరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఎస్.కోట-ధర్మవరం రహదారిలో ఆర్‌టిసి ఎస్.కోట డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని, వివిధ రకాలైన లోపాలు ఉన్న 90 వాహనాలను తనిఖీ చేసి, 4 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. రూ.21 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకట్రావు, ఎడిసి రామకష్ణ, ఆర్‌హెచ్‌సి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇఒ జనార్ధన్‌రావుకు సన్మానం

ప్రజాశక్తి-గజపతినగరం

ఉద్యోగోన్నతిపై బొబ్బిలి వెళ్తున్న పురిటిపెంట పంచాయతీ ఇఒ జి.జనార్ధన్‌రావును మండల అధికారులు, ప్రజాప్రతినిధులు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఇఒ జనార్ధన్‌రావు మాట్లాడుతూ అందరి సహకారంతోనే సక్రమంగా పనిచేశానని, ఇక్కడ పనిచేసిన కాలం చాలా సంతృప్తినిచ్చిందని తెలిపారు. అందరి సహాయ సహకారాలు ఎప్పటికీ మరచిపోలేనివని చెప్పారు.

సంకిలి పంచాయతీ కార్యదర్శిగా శైలజ

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామ సచివాలయ కార్యదర్శిగా డి.శైలజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కొత్తవలస సచివాలయం గ్రేడ్-2 నుంచి గ్రేడ్ వన్ కార్యదర్శిగా ఉద్యోగోన్నతిపై సంకిలి వచ్చారు. శైలజకు సర్పంచి బుడుమూరు పట్టాభి, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సాఫ్ట్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి : పుత్తూరులో ఆగస్టు 10,11,12తేదీల్లో జరగనున్న సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు పారాది జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 13న క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సుంకరి సాయిరమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న సీనియర్ పురుష,మహిళా సాఫ్ట్ బాల్ క్రీడాకారులు గుర్తింపు కార్డుతో ఎంపికకు హాజరు కావాలని కోరారు.

బాలుడికి ఆర్థిక సాయం

భోగాపురం : అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి భోగాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ముక్కాం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు కారి పవన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆపరేషన్ కోసం పది లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో రావడంతో ఆయన తనవంతు సాయం అందించి ఉదారత చాటుకున్నారు.

చదురుగుడి ఆదాయం రూ.13.46 లక్షలు

విజయనగరం టౌన్ : నగరంలోని పైడితల్లి అమ్మవారి దేవస్థానం చదురుగుడిలోని 9 హుండీలను బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ సమక్షంలో లెక్కించారు. 37 రోజులకు గాను నగదు రూపంలో రూ.13,43,881, బంగారం 18 గ్రాముల 600 మిల్లీ గ్రాములు, వెండి 486 గ్రాములు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి డివివి ప్రసాదరావు తెలిపారు. పైడితల్లి అమ్మవారి సేవా సమితి సిబ్బంది, కెనరా బ్యాంకు అధికారులు, పోలీస్ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలి

ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చేయాలని, సమ్మె కాలపు ఒప్పంద జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు ధర్నాలు చేశారు. కార్మికుల కోర్కెల దినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు.అనంతరం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ, శ్రామిక మహిళ జిల్లా నాయకులు బి.సుధారాణి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయింపు పెంచి ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేయాలని, వర్కర్లను, హెల్పర్లను కార్మికులుగా గుర్తించి గుజరాత్, తమిళనాడు తరహాలో గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, 42 రోజుల సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభ, విశాలాక్షి, శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టివి రమణ ప్రబుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐసిడియస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్ వాడీలను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు, అంగన్‌వాడీ నాయకులు టి మాలతి, కె నాగమణి, డి గౌరి, కె కష్ణవేణి, డి లలిత పాల్గొన్నారు.





విజయనగరంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు ; శృంగవరపుకోటలో సూపర్‌వైజర్‌కి వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు తమ్మినేని, అంగన్వాడీలు

ఆశావర్కర్ల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక విజయనగరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశావర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఏ. జగన్మోహన్‌రావు, .రమణ మాట్లాడుతూ ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, 10 లక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని, పని భారం తగ్గించాలని, ఎఎన్ఎంల నియమాకాల్లో ఆశా వర్కర్లకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతినిచ్చారు. యూనియన్ విజయనగరం రూరల్ అర్బన్ కార్యదర్శులు మహాలక్ష్మి, వెంకటలక్ష్మి, నాయకులు సునీత, పద్మ, ఈశ్వరమ్మ, కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఎన్నికల ముందు అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అంగన్వాడీల కోర్కెల దినం సందర్భంగా పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్వాడీలు ధర్నా చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ దేవికి వినతి అందించారు. ఈ సందర్భంగా తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ఐసిడిఎస్‌కి బడ్జెట్ ఎక్కువ కేటాయించి బలోపేతం చేస్తామని అంగన్వాడీలు సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం అంగీకరించిన మినిట్స్ కాపీలో అంశాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఐసిడిఎస్‌ను ప్రయివేటు సంస్థలకు అప్పగించరాదని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డి.శ్యామల, కెవి లక్ష్మి, డి.జయలక్ష్మి, డి.దంతేశ్వరి, క్రాంతి, కనకమహాలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : అంగన్వాడీలు, విఒఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు ఆధ్వర్యాన అంగన్వాడీలు తహశీల్దార్ త్రినాథ్‌కు వినతి అందించారు.

గజపతినగరం : ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి ఆధ్వర్యాన అంగన్వాడీలు నిరసన చేపట్టారు. ఐసిడిఎస్ పిఒ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఎన్‌జిఒ హోం నుంచి ఐసిడిఎస్ కార్యాలయం వరకు తొలుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి, నాయకులు బి.సౌజన్య, జి.సన్యాసమ్మ, రాములమ్మ, రమణమ్మ, వాణి గణపతి, నారాయణమ్మ, పద్మ, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో దోపిడీకి అడ్డుకట్ట

ఎమ్మెల్యే బేబినాయన



ఇసుక నిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీ అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. గ్రోత్ సెంటర్లో ఉచిత ఇసుక కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో ఇసుక దోపిడీ జరిగిందన్నారు. సామాన్యులకు ఇసుక దొరక్కపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలని తహశీల్దార్ త్రినాథరావును ఆదేశించారు. ఎడ్ల బండ్లతో ఇసుక తరలిస్తే కేసులు పెట్టవద్దని, ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తే కేసులు నమోదు చేయాలని రెవెన్యూ, పోలీస్, ఎస్ఇబి అధికారులకు సూచించారు. ఇసుక తరలిస్తూ పట్టుబడితే తనకు ఫోన్ చేయొద్దని, ఇసుక అక్రమ రవాణాకు తన మద్దతు ఉండదని స్పష్టంచేశారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు అంకితం

టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. గ్రోత్‌సెంటర్ సమీపంలోని టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ పేదల కోసం గతంలో టిడిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తే, వైసిపి ప్రభుత్వం నిర్మాణం చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. 2445 ఇళ్లను పూర్తి చేసేందుకు రూ.26కోట్లు మంజూరు చేస్తానన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు సేవలు అందిస్తున్న విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు.. కోటలో ఎమ్మెల్యే బేబినాయనకు వినతిపత్రం అందజేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని గ్రామాల్లో విఒఎలను అక్రమంగా తొలగిస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వంతో చర్చించాలని కోరారు.

ఆర్ఐని సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న శ్రీచైతన్య కళాశాల యాజమాన్యానికి కొమ్ము కాస్తున్న ఆర్ఐని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనంలో శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం ఇంటర్ తరగతులు నిర్వహించడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు ప్రభుత్వ గుర్తింపు లేనప్పటికీ శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం అడ్మిషన్లు చేసి, తరగతులు నిర్వహించి, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. భవనం పనులు పూర్తి కాకుండా తరగతులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. నిర్మాణ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. అనుమతులు లేకుండా నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా యాజమాన్యానికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, మణి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



తరగతులకు వెళ్లకుండా విద్యార్థులను అడ్డుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

13, 14న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

స్థానిక లోకబంధు రెసిడెన్సీలో ఈనెల 13, 14న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని బుధవారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని నాశనం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్ట్రంలో ఉన్న టిడిపి, జనసేన, వైసిపి మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. జిల్లా ప్లీనరీలో విద్యారంగ సమస్యలను చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

పాఠశాలల్లో డిఇఒ తనిఖీలు



విద్యార్థికి ఆహారం వడ్డిస్తున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని వివిధ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ బుధవారం పరిశీలించారు. పోలిపల్లి ఉన్నత పాఠశాలతో పాటు భోగాపురంలోని కెజిబివిని తనిఖీ చేశారు. పోలిపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వాహకులు వండిన వంటలను రుచి చూశారు. అనంతరం కెజిబివిలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని స్టూడెంట్స్ కిట్స్‌కు సంబంధించిన పంపిణీ తీరును ఎంఇఒ బి.చంద్రమౌళిని అడిగి తెలుసుకున్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ డి.సూర్యనారాయణ, సిఆర్‌పి కనకరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్, ఇఒ

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి-కొత్తవలస

పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇఒ బిఎస్ఎన్ రత్నమాలిక అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంచాయతీ పరిధిలో 30 వేలు దాటి జనాభా ఉందని, ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీలో అపారిశుధ్య, విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఎక్కడ ఏమైనా ఇబ్బంది కలిగితే తన దృష్టికి తేవాలన్నారు. ప్రతి విభాగం ఫిర్యాదుల స్వీకరణ పుస్తకాన్ని నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'వాగ్దేవి'లో జాబ్‌మేళా

ప్రజాశక్తి-కొత్తవలస

వాగ్దేవి విద్యాసంస్థల్లో బుధవారం మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యాన జాబ్‌మేళా ఏర్పాటుచేశారు. ఈ మేళాకు హాజరైన సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు, శారదా మెటల్స్ అండ్ ఎలైస్ లిమిటెడ్ డిజిఎం(హెచ్ఆర్) హెచ్.సన్యాసిరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ జాబ్‌మేళాలో పాల్గొని మంచి ఉద్యోగాలు పొందాలని కోరారు. బంగారు భవిష్యత్తుకు ఓ బాట వేసుకోవాలని, తద్వారా మీరు, మీ కుటుంబం సంతోషంగా ఉండాలని కోరారు. జాబ్‌మేళాకు 500 మంది హాజరు కాగా 299 మంది కొలువులు సాధించారు. కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కె.మహేష్, డైరెక్టర్ ప్రవీణ్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న అతిథులు

విద్యార్థి కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట, ఆకులసీతంపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సర్పంచులు, ఎంపిటిసిల చేతుల మీదుగా స్టూడెంట్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన ఎర్రచందనం తోట

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 219లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని ఎర్రచందనం తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన సిరికి రమణ, తదితరులు వెంటనే స్పందించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-వేపాడ

విద్యుదాఘాతానికి గురై హోంగార్డు గిడుతూరి వెంకట సత్యం మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో బొద్దాంలో చోటుచేసుకుంది. సత్యం తన ఇంటి వద్ద బుధవారం ఉదయం విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



మృతిచెందిన వెంకట సత్యం

చికిత్స పొందుతూ మరొకరు..

రేగిడి : మండలంలోని పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు బుధవారం శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా రెండు రోజుల క్రితం రాజాంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. శ్రీనివాసరావు మృతదేహానికి ఆయన స్వగ్రామం రేగిడి మండలం అచ్చారాయపురంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎఎస్ఐ రాజారావు, పోలీస్ సిబ్బంది పోలీస్ వందనం చేశారు. ఆయన మృతికి ఎస్ఐ శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.